ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
చిత్తూరు
జిల్లా వార్తలు
శనివారం 21 సెప్టెంబరు 2024





# నా గుండెల్లో బంగారుపాళ్యం

- బంగారుపాళ్యం నుంచే దండయాత్రగా మారిన యువగళం
- పాదయాత్రను అడ్డుకునేందుకు వైసీపీ విఫలయత్నం
- తోడుగా నిలిచిన ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటా
- మంత్రి లోకేశ్



కిడ్నీ బాధితుడికి భరోసా



పసిబిడ్డకో చిరు ముద్దు

యువనేతకు ఘనస్వాగతం

'బంగారుపాళ్యం నా గుండెల్లో ఉంటుంది. పాదయాత్రలో ఇక్కడ నాపైన డీఎస్పీ దాడి చేస్తే, లాఠీఛార్జికి ప్రయత్నిస్తే, స్టూల్ లాక్కుంటే ఇక్కడి ప్రజలే అండగా నిలిచారు. డీఎస్పీ తీరుతో కానిస్టేబుళ్లు కూడా సహాయనిరాకరణ చేశారు.పాదయాత్రలో మీరు నాపై చూపిన అభిమానానికి రుణం తీర్చుకోవడానికే ఈ రోజు ప్రజాప్రభుత్వంలో మంత్రిగా మీ ముందుకు వచ్చా' అని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.యువగళం పాదయాత్రలో వంద కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని నిలబెట్టుకుంటూ శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని లోకేశ్ ప్రారంభించారు. కొత్తగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రి భవనాల్ని ప్రారంభించారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు.

- చిత్తూరు,ఆంధ్రజ్యోతి/ బంగారుపాళ్యం

వచ్చే ఐదేళ్లలో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటా. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో ఎవరూ చేయని విధంగా 14 నియోజకవర్గాలను టచ్ చేస్తూ 45 రోజుల పాటు 577 కిలోమీటర్ల మేర కొనసాగిన యువగళం పాదయాత్ర రికార్డు సృష్టించింది. పాదయాత్రను అడ్డుకోవడానికి బంగారుపాళ్యంలో జగన్ ప్రభుత్వంలోని పోలీసులు ఎంత అరాచకం సృష్టించారో మీరంతా చూశారు.అప్పటి డీఎస్పీ అమరన్న చేయి పట్టుకున్నారు. నేను నిలదీస్తే నాపైనా కేసులు పెట్టారు. హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వంటి 23 కేసులు నమోదు చేశారు.అంతే కాకుండా నా పాదయాత్రను అడ్డుకునేందుకు జీవో 1 విడుదల చేసి, ఇదే బంగారుపాళ్యంలో నా ప్రచార రథాన్ని అడ్డుకున్నారు. నా గొంతు నొక్కాలని విఫలయత్నం చేశారు.ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువగళాన్ని ఆపడం వారి తరం కాలేదు.ఇక్కడి ప్రజల మద్దతుతోనే కుప్పంలో ప్రారంభమైన యువగళం పాదయాత్ర దండయాత్రగా మారింది.

బంగారుపాళ్యం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారు. డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లడానికి డబ్బు, సమయం ఖర్చవుతోంది. ప్రైవేటు కేంద్రాల్లో చేయించుకోవడం ఇక్కడి పేదలకు తలకు మించిన భారం.కాబట్టే పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం, మీ అందరి ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇక్కడ డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించా. అసలు ఇక్కడ డయాలసిస్ అవసరం ఎందుకు పెరిగిందో విచారించి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని అందించే పనులు కూడా త్వరలో ప్రారంభిస్తాం.



పెచ్చులూడిన తరగతి గది పరిశీలన

## ఆకనంబట్టు హైస్కూల్లో ఆకస్మిక తనిఖీలు

పూతలపట్టు,సెప్టెంబరు 20:పూతలపట్టు మండలం ఆకనంబట్టు ఉన్నత పాఠశాలను మంత్రి నారా లోకేశ్ శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు.8, 9, 10 తరగతుల గదులను సందర్శించి లోటుపాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.బెంచీలు లేకపోవడంతో నేలపై కూర్చొని చదువుకోవాల్సి వస్తోందని విద్యార్థులు చెప్పగా, త్వరలో ఫర్నిచర్ ఏర్పాటు చేస్తామని హామీయిచ్చారు. టాయిలెట్స్ పరిశుభ్రత గురించి ఆరాతీయగా...గతంలో కంపుకొట్టేవని, ప్రస్తుతం పరిశుభ్రంగా ఉంటున్నాయని విద్యార్థులు చెప్పారు. కొంతమంది విద్యార్థులు తమకు ఇంకా పాఠ్యపుస్తకాలు అందలేదని చెప్పడంతో తక్షణమే అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.తరగతి గదులు పెచ్చులూడుతున్నాయని టీచర్లు చెప్పగా... మరమ్మతులు చేయిస్తానని హామీ యిచ్చారు.టీచర్లతో జరిగిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 70శాతం మాత్రమే ఉండడానికి కారణమేంటని ప్రశ్నించారు.పాఠశాలలకు రవాణా సౌకర్యం మెరుగుపరచాల్సి ఉందని టీచర్లు బదులిచ్చారు.ఒక్కసారిగా ప్రభుత్వ స్కూళ్లను మార్చడం సాధ్యం కాదన్న లోకేశ్ మౌలిక సదుపాయాలను కల్పించి క్రమేణా విద్యాప్రమాణాలను మెరుగుపరుస్తామని చెప్పారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.గత ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లలో విద్యార్థులు అనవసరమైన కంటెంట్ చూస్తున్నట్లు ఫిర్యాదులు అందిన దృష్ట్యా ట్యాబ్‌లకు బదులుగా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని, మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు గంగారపు గోపి, గణపతి నాయుడు, శేషాద్రి నాయుడు, నేతాజి తదితరులు పాల్గొన్నారు.



ఆకనంబట్టు విద్యార్థులతో మాటామంతి





యువనేత కరచాలనం కోసం ఎగబడ్డ జనం

## అర్జీదారులతో కిక్కిరిసిన 'ప్రజాదర్బార్'

బంగారుపాళ్యంలోని ఎస్ఎల్‌వీ కళ్యాణమండపంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.మంత్రి లోకేశ్‌కు అర్జీలు ఇవ్వడానికి, ఫొటోలు తీసుకోవడానికి పెద్దఎత్తున ప్రజలు ఎగబడ్డారు.వేతనాలు పెంచడంతో పాటు తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు అర్జీ ఇచ్చారు. ఎలాంటి ఆలనాపాలనా లేని తన మనవరాలికి ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని బంగారుపాళ్యం మండలం టేకుమందకు చెందిన గోవిందమ్మ కోరారు. జీవో 117 రద్దుతో పాటు సీపీఎస్‌పై నిర్ణయం తీసుకోవాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కోరారు. గత ప్రభుత్వం చేపట్టిన స్టాఫ్ నర్సుల నియామకాల్లో జరిగిన అక్రమాలను సరిదిద్ది న్యాయం చేయాలని రామసముద్రానికి చెందిన దివ్య కోరారు. విద్యాశాఖలో సీఆర్‌ఎంటీలను రెగ్యులర్ చేయాలని ఏపీ క్లస్టర్ రీసోర్స్ పర్సన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఐరాల గ్రామంలో షాదీమహల్ పెండింగు పనులు పూర్తి చేసిన తమకు బిల్లులు మంజూరు చేయాలని జలీల్ బాషా కోరారు. తిరుపతిలో అన్యాక్రాంతమైన హథీరాంజీ మఠం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని హథీరామ్ బావాజీ పరిరక్షణ కమిటీ కోరింది.

## లోకేశ్ పర్యటన విజయవంతం

చిత్తూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తన పాదయాత్రలో ఇచ్చిన తొలి హామీని అమలు చేసేందుకు వచ్చిన మంత్రి లోకేశ్ పర్యటన విజయవంతమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి ఆయన జిల్లాకు రావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు జనం కూడా ఆయన్ను కలిసేందుకు ఎగబడ్డారు.గురువారం రాత్రి బంగారుపాళ్యం బయల్దేరిన ఆయనకు రేణిగుంటలోని ఎయిర్‌పోర్టు నుంచి దారంతా టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. దీంతో ఆలస్యంగా బంగారుపాళ్యం చేరుకున్నారు. శుక్రవారం ఉదయాన్నే తన కోసం వచ్చిన పార్టీ శ్రేణులకు, అభిమానులకు సమయం కేటాయించి అందరితో మాట్లాడారు.ఫొటోలు దిగారు. ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. శ్రేణులతో విడిగా సమావేశమై ఉత్తమ కార్యకర్తల్ని అభినందించారు. తిరుగుప్రయాణంలో గాదంకి టోల్‌ప్లాజా వద్ద టీడీపీ నేత రమేష్‌కు చెందిన మురుగన్ టీ షాప్‌లో కార్యకర్తలతో కలసి టీ తాగారు.పాదయాత్రలో అనుభవాలను గుర్తు చేసుకున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ బంగారుపాళ్యంలోని అన్ని కార్యక్రమాల్లో లోకేశ్ వెంటే ఉండగా.. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, పులివర్తి నాని, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.



### ● పాదయాత్ర స్మృతులు

బంగారుపాళ్యంలో పాదయాత్ర సమయంలో పోలీసులు లోకేశ్ మైకు లాగేయడంతో అక్కడి భవనంపై నుంచి ఆయన ప్రసంగించారు. శుక్రవారం ఆ భవనం ఎదుట నిలబడి సెల్ఫీ తీసుకున్నారు. అలాగే యువగళం వంద కిలోమీటర్లు చేరుకున్నప్పుడు బంగారుపాళ్యంలో ఏర్పాటుచేసిన శిలాఫలకం వద్ద మరో సెల్ఫీ దిగారు.

### ● పార్టీ కార్యకర్తలతో

'ప్రజలు మనపై పవిత్ర బాధ్యతను పెట్టారు.అందుకే వంద రోజుల్లో అనేక హామీలను నెరవేర్చాం.టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి మన ప్రభుత్వం నెరవేర్చిన హామీలను వివరించాలి. మంచి పనులు చేయడంతో పాటు చేసిన పనిని చెప్పుకోవాలి.అందుకే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి' అని టీడీపీ శ్రేణులను లోకేశ్ కోరారు.బంగారుపాళ్యంలో ఆయన బస చేసిన ప్రాంతం వద్ద టీడీపీ శ్రేణులతో ఉత్తమ కార్యకర్త, మన టీడీపీ యాప్ ఛాంపియన్స్' సమావేశాల్ని నిర్వహించారు. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మన టీడీపీ యాప్ ద్వారా ఉత్తమ పనితీరు కనబరచిన కార్యకర్తలకు ప్రశంసాపత్రాలందించారు.





# తిరుపతి ఆర్డీవోపై వేటు

- అవినీతి ఆరోపణల కేసులో చిక్కిన నిషాంత్‌రెడ్డి
- అప్పటి పుత్తూరు తహసీల్దారు, కలెక్టరేట్ సూపరింటెండెంటు కూడా సస్పెన్షన్



నిషాంత్‌రెడ్డి

తిరుపతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఓ పెట్రోల్ బంకుకు ఎన్వోసీ ఇచ్చేందుకు తన క్యాంప్ క్లర్క్ ద్వారా రూ.లక్ష డిమాండు చేశారన్న బాధితుడి ఫిర్యాదు, అనంతరం వివిధ దశల్లో జరిగిన సుదీర్ఘ విచారణ మేరకు ఆయన్ను సస్పెండు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్వాపరాలను పరిశీలిస్తే.. పుత్తూరు సమీపంలో హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంకు శ్రీనివాసులు కుటుంబానికి అన్ని అనుమతులతో మంజూరైంది. ఎన్వోసీ (నిరభ్యంతర పత్రం) కోసం ఫైలు ఆర్డీవో కార్యాలయానికి చేరింది. ఆర్డీవో నిషాంత్ రెడ్డి తన క్యాంప్ క్లర్క్ ద్వారా ఎన్వోసీ కోసం రూ.లక్ష డిమాండు చేశారని బాధితుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్వోసీ ఇవ్వాలని కలెక్టర్ సూచించినా మరోసారి తన సీసీ ద్వారా రూ.50వేలు వసూలు చేశారు.భూమార్పిడి కోసం మరో రూ.30వేలు డిమాండు చేయడంతో సీసీఎల్ఏకు ఫిర్యాదు చేశారు. దీంతో జేసీ శుభం బన్సల్‌తో విచారణ జరిపించగా, ఆయన ఆర్డీవోకు అనుకూలంగా నివేదిక ఇచ్చారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో సీసీఎల్ఏ సాయిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి విచారించాలని జేసీ శుభం బన్సల్‌ను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిషాంత్‌రెడ్డిలో కలవరం మొదలైంది. తనపై ఫిర్యాదుచేసిన బాధితుడి ఇంటికి రెవెన్యూ అధికారులను పంపి, ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దీనిపైనా మరోసారి సీసీఎల్ఏకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆర్డీవోపై సస్పెన్షన్ వేటు వేసి కేసును ఏసీబీకి అప్పగించాలని సీసీఎల్ భావించింది. కాగా, ఎన్నికలకు ముందు చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించడంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారన్న ఆర్డీవో నిషాంత్‌రెడ్డిపై ఆరోపణలు వచ్చాయి. అప్పటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నాని, ఆయన భార్య సుధారెడ్డి దీనిపై పలుసార్లు ఫిర్యాదులు కూడా చేశారు. పోలింగ్ అనంతరం తిరుపతిలో జరిగిన గొడవలపై వైసీపీది ఎలాంటి తప్పులేనట్టుగా నివేదిక ఇచ్చారు. మరో ఏడాదిలో ఐఏఎస్‌గా పదోన్నతి లభించే అవకాశం ఉన్న అధికారి అవినీతి ఆరోపణలతో సస్పెండవడం చర్చనీయాంశమైంది. అలాగే, ఈ కేసులో అప్పటి పుత్తూరు తహసీల్దారు పరమేశ్వరస్వామి (ప్రస్తుతం అనంతపురం జిల్లా ఆత్మకూరు తహసీల్దారు), కలెక్టర్ కార్యాలయంలోని సంబంధిత సూపరింటెండెంట్ సురేష్‌బాబునూ సస్పెండు చేశారు.





కోటూరు వద్ద జరిగిన ప్రజా వేదికపై గ్రామస్తులు, నాయకులు, అధికారులతో కలిసి కూర్చొన్న మంత్రి లోకేశ్

# డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో మరింత మేలు

## ప్రజావేదికలో గ్రామస్తుల ప్రశ్నలు.. మంత్రి లోకేశ్ సమాధానాలు

చిత్తూరు, ఆంధ్రజ్యోతి/ బంగారుపాళ్యం, సెప్టెంబరు 20: బంగారుపాళ్యం మండలం ఎన్.కోటూరు గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్తులు మంత్రి లోకేశ్‌ని అడిగిన ప్రశ్నలు, ఆయన చెప్పిన సమాధానాలిలా.



? డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో పాదయాత్రలో ఇచ్చిన తొలి హామీ అమలు చేశారు. జిల్లాలో ఇచ్చిన మిగిలిన హామీలను కూడా అమలు చేస్తారా

- వీరరాఘవులు నాయుడు, సదకుప్పం, బంగారుపాళ్యం మండలం

**లోకేశ్:** తొలి హామీ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో ఈ ప్రాంత బాధితులకు చాలా మందికి మేలు కలగనుంది. ఇదే తరహాలో పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలను కచ్చితంగా అమలు చేస్తాను.



? ఏటా జాబ్ క్యాలెండర్ అన్నారు. మొదటిది ఎప్పుడు ఇస్తారు. అసలు 20 లక్షల ప్రైవేటు ఉద్యోగాలు ఇస్తామన్నది సాధ్యమా

- వైష్ణవి, బంగారుపాళ్యం

**లోకేశ్:** జాబ్ క్యాలెండర్ హామీకి కట్టుబడి ఉన్నాం. చంద్రబాబు సీఎం అయ్యాక మెగా డీఎస్సీపైనే తొలి సంతకం పెట్టారు. జనవరిలో ఖాళీల వివరాలు చెప్తాం. ఐదేళ్లలో పెండింగ్ పోస్టులన్నీ భర్తీ చేస్తాం. అలాగే, ఇప్పుడు మన సీఎంపై నమ్మకంతో బడా పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఇప్పుడు మనం పక్క రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళుతున్నాం. భవిష్యత్తులో పొరుగు రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం మన వద్దకు వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది.



? కాదంబరి జెత్వానీ విషయంలో వైసీపీ అన్యాయం చేసింది. తెర ముందు ఉన్నవారితోపాటు తెర వెనుక ఉన్నవారిని కూడా శిక్షిస్తారా. ఆనాడు మహిళలకు అండగా ఉంటానన్నారు కదా?

- గ్రీష్మ, బంగారుపాళ్యం

**లోకేశ్:** అప్పుడూ చట్టాలున్నాయి. వాటిని ఉల్లంఘించి, దొంగ కేసులు పెట్టి ఓ అక్కను ఇబ్బంది పెట్టారు. ఫలితంగా ముగ్గురు ఐపీఎస్‌లు సస్పెండ్ అయ్యారు. అలాంటి అక్రమాలు చేసిన అధికారుల వివరాలు నా బుక్‌లో ఉన్నాయి. అసలు మహిళల్ని గౌరవించేలా విద్యార్థులకు నరనరాల్లో ఎక్కించేలా సిలబస్ ఉండాలి. చేస్తాం.



? జిల్లాకు ఎలాంటి పరిశ్రమలు తెస్తారు. ఉపాధి కోసం బయటికి రాష్ట్రాలకు వెళ్లేవారికి మీరేం చెప్తారు

- వరుణ్, కాణిపాకం

**లోకేశ్:** 2014-19 మధ్యలో చంద్రబాబు తిరుపతి, రేణిగుంట, ఏర్పేడు ప్రాంతాల్లో పెద్దఎత్తున ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు తెచ్చారు. అవన్నీ ఇప్పుడు విజయవంతంగా నడుస్తున్నాయి. గత ప్రభుత్వం తీరుతో మనకు పరిశ్రమలు రాలేదు. పీఎం మోదీ కూడా మన రాష్ట్రంపై దృష్టి పెట్టారు. పెట్టుబడుల్ని చంద్రబాబుతోపాటు ఆయన కూడా ప్రోత్సహిస్తున్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కాబట్టి మరింత మేలు జరగనుంది. ● నాకు ఏడాది టైమ్ ఇవ్వు. పొరుగు రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం మన వద్దకు వచ్చేలా చేస్తాను.



? డయాలసిస్ బాధితులు మండలాల నుంచి కేంద్రానికి వచ్చేలా 108 ఏర్పాటు చేయండి

- భానుమతి, పూతలపట్టు మండలం

**లోకేశ్:** 108, 104 వాహనాల విషయంగా ఇప్పటికే ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడాను. జగన్ తన బినామీలకు అంబులెన్సు కాంట్రాక్టు ఇచ్చారు. దాన్ని రద్దు చేసి మళ్లీ ఆ వ్యవస్థను పునరుద్ధరిస్తాను.



? తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు ప్రారంభిస్తారు

- గాయత్రి, విజ్ఞాన్ జూనియర్ కాలేజీ

**లోకేశ్:** ఓ పద్ధతి ప్రకారం హామీలన్నీ అమలు చేస్తున్నాం. దీపావళికి ఉచిత సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తున్నాం. అలాగే తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ప్రారంభిస్తాం. ఫీజును మళ్లీ పాత విధానంలోనే చెల్లించేలా ఆలోచిస్తున్నాం.



? మా పాపకు ఆరోగ్యం సరిగా లేదు. బీపీ తక్కువ అయిపోతోంది. ఆదుకోండి

- బిడ్డ హర్షిణిని చూపుతూ కన్నీరు పెట్టుకున్న తల్లి ప్రియాంక, కేజీ సత్రం

**లోకేశ్:** పాప ఆరోగ్యం బాధ్యత నేను తీసుకుంటాను. ఎమ్మెల్యే మురళి.. మీ వివరాలు సేకరించి ఫాలోఅప్ చేస్తారు. మీరు ఏడవద్దు. ధైర్యంగా ఉండండి.



? మీ పాదయాత్రలో.. పుంగనూరు, అంగళ్లు చంద్రబాబు పర్యటనల్లో అడ్డంకులు సృష్టించి, అక్రమ కేసులు పెట్టారు. వారి మీద ఎప్పుడు చర్యలు తీసుకుంటారు

- దొరబాబు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, బంగారుపాళ్యం

**లోకేశ్:** నా చర్యలు కనిపించడం లేదా? గత ప్రభుత్వంలో చట్టాన్ని అతిక్రమించిన అధికారులు ఇప్పటికే సస్పెన్షన్, విచారణలు ఎదుర్కొంటున్నారు. మరో ఆరు నెలల్లో ఇలాంటి చర్యలన్నింటినీ పూర్తి చేస్తాను.

## గంటా మోహన్‌కు లోకేశ్ అభినందన



బంగారుపాళ్యం, సెప్టెంబరు 20: 'శభాష్ గంటా.. నేను 8సార్లే రక్తదానం చేశాను. మీరు వందోసారి చేస్తున్నారంటే గ్రేట్, కంగ్రాట్స్' అని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రిలో వందోసారి రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేత గంటా మోహన్‌ను మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎక్కడ పనిచేస్తున్నారని మంత్రి అడగ్గా.. అక్కడి అధికారి ఒకరు, గంటా మోహన్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నేత అని చెప్పారు. దీంతో ఆయన నవ్వుతూ.. విద్యాశాఖలో అంతా గందరగోళంగా ఉందని, అన్నీ సర్దుతామని అన్నారు.. లోకేశ్ వెంట వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా గంటాను ప్రత్యేకంగా అభినందించారు.

## జ్వరంతో చిన్నారి మృతి



షబా పర్వీన్ (ఫైల్‌ఫొటో)

సదుం, సెప్టెంబరు 20: జ్వరం బారిన పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం సదుంలో జరిగింది. సదుం గ్రామం జాండ్రపేట నివాసి షెహన్‌షా కుమార్తె షబా పర్వీన్(04) సుమారు ఐదు రోజులుగా జ్వరంతో అస్వస్థతకు గురైంది. ఆ చిన్నారిని పీలేరులోని ఓ ప్రైవేటు చిన్నపిల్లల ఆసుపత్రిలో వైద్యం అందించినట్లు తండ్రి షెహన్‌షా తెలిపారు. ఈ క్రమంలో గురువారం రాత్రి కడుపు నొప్పి అంటూ ఏడుస్తున్న చిన్నారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుల సలహా మేరకు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే చిన్నారి మృతి చెందినట్లు తండ్రి తెలిపాడు. షబా పర్వీన్ మృతితో ఆ వీధిలో విషాదం నెలకొంది. కాగా సదుం ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న చిన్నపిల్లల వైద్య నిపుణులు డా.శ్రీధర్ గత ఏడాది జూన్‌లో బదిలీ అయ్యారు. అప్పటి నుంచి చిన్నపిల్లల వైద్యుడి పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో చిన్నపిల్లల వైద్యం కోసం మండల ప్రజలు ఎక్కువ మంది పీలేరులోని ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఖాళీ పోస్టు భర్తీ కోసం డీసీహెచ్ఎస్ కార్యాలయ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆసుపత్రి వైద్యాధికారిణి పుష్పకుమారి తెలిపారు.

## ప్రేమ పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని...

### రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



అశోక్(ఫైల్‌ఫొటో)

గుడుపల్లె, సెప్టెంబరు 20: ప్రేమపెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గుడుపల్లె మండలంలో చోటుచేసుకొంది. స్థానికులు, రైల్వే పోలీసుల కథనం మేరకు..యామిగానిపల్లె గ్రామానికి చెందిన మునిరత్నం కుమారుడు అశోక్(24) కుప్పంలో ఒకరి దగ్గర పనిచేస్తున్నాడు. ఇతడు కుప్పంలో ఓ యువతిని ప్రేమించాడు. అశోక్ ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వీరిద్దరి కులాలు వేర్వేరు కావడంతో అశోక్ కుటుంబ సభ్యులు వీరి పెళ్లికి అడ్డు చెప్పారు. కొన్ని నెలలుగా అశోక్ పెళ్లి విషయమై ఇంట్లో గొడవలు చోటుచేసుకొనేవి. గురువారం రాత్రి అశోక్ ఆ యువతితోనే పెళ్లి జరిపించాలని కుటుంబ సభ్యులను కోరగా వారు కుదరదన్నారు. పెళ్లి జరిపించకపోతే తాను ఆత్మహత్య చేసుకొంటానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి ద్విచక్రవాహనం తీసుకొని బయలుదేరాడు. కుప్పం రైల్వేస్టేషన్ దగ్గర తన ద్విచక్రవాహనాన్ని ఉంచి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అశోక్ కోసం గాలించగా కుప్పం రైల్వేస్టేషన్‌కు కొంతదూరంలో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకుని ఉండటాన్ని గమనించారు. దీంతో వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టు నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## విమాన వాహనంపై గణనాథుడి విహారం



విమానంలో ఊరేగుతున్న సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 20: కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాలలో శుక్రవారం వరసిద్ధుడు విమాన వాహనంపై విహరించారు.ఉభయదారులైన ఐరాలకు చెందిన దివంగత రామకృష్ణపిళ్లై కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. రాత్రి ఉభయదారులు వరస తీసుకురావడంతో అలంకార మండపంలో స్వామి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహించి.. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను విమాన వాహనం (సప్పరం)పై ఉంచి కాణిపాక పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈవో గురుప్రసాద్, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు.

### పుష్పపల్లకి సేవకు భారీ ఏర్పాట్లు

కాణిపాకంలో శనివారం స్వామికి పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నారు.ఉభయదారులు భారీ ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రధాన ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామి దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్లను ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. లడ్డు, ప్రసాదాల కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లు పెడుతున్నారు.



పుష్పపల్లకి ఏర్పాట్లలో ఉభయదారులు

## మమ.. అనిపించారు!

- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి గైర్హాజరైన పలువురు అధికారులు, జడ్పీటీసీలు
- కోరం లేకుండానే రెండు సమావేశాల నిర్వహణ



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం తూతూ మంత్రంగా నిర్వహించారు. 1 నుంచి 7 సమావేశాలను ఒక్కే దగ్గర నిర్వహించారు. ఇందులో రెండు సమావేశాలను కోరం లేకుండానే ముగించారని విమర్శలు వస్తున్నాయి. రెండు గంటల్లోనే సమావేశాలన్నిటినీ ముగించారు. వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు ఒకరు ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. జడ్పీటీసీ సభ్యులు కూడా కొందరే వచ్చారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కొందరు సభ్యులు కొన్ని సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా.. చిత్తూరులో అమూల్ డెయిరీ ప్రారంభమైనా పాల సేకరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరులో జాప్యాన్ని నివారించాలని కోరారు. వి.కోట ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రైతే వైద్యులు ఉండడం లేదని చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో గ్లోరియా, జడ్పీ వైస్‌చైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి లోకేశ్ పర్యటనే కారణమా?

బంగారుపాళ్యంలో మంత్రి లోకేశ్ పర్యటన కారణంగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి దాదాపుగా జిల్లా స్థాయి అధికారులు హాజరు కాలేనట్టుగా తెలుస్తోంది. ఇక ఎమ్మెల్యేలు కూడా మంత్రి కార్యక్రమంలో ఉండడంతో సమావేశానికి హాజరుకాలేకపోయారు. జడ్పీటీసీలైతే స్టాండింగ్ కమిటీనే కదా అని లైట్‌గా తీసుకున్నారు. మొత్తానికి సమావేశాన్ని మమ అనిపించారు.

## భూమాయగాడు

### నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్

### తహసీల్దార్ ఫిర్యాదుతో వెదురుకుప్పంలో కేసు నమోదు




నకిలీ పత్రం ఇదే

వెదురుకుప్పం, సెప్టెంబరు 20: భూమి మీద కన్నుపడింది. ఆ భూమిని తన సొంతం చేసుకోవాలనుకున్నాడు. అంతే నకిలీ పత్రాలను సృష్టించి ఏకంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడు. ఈ ఘనుడిపై వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయాన్ని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం ధ్రువీకరించారు. వివరాలిలా ఉన్నాయి. వెదురుకుప్పం మండలం జక్కిదొన రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు 513/16లో 0.66 సెంట్ల భూమికి ఇదే మండలంలోని గంటావారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి కుమారుడు ఎస్.పుల్లారెడ్డి (వైసీపీ సానుభూతిపరుడు) నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ భూమి సొంతదారైన గంటావారిపల్లెకు చెందిన ఎస్.నీలమ్మ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో విషయం బయట బడింది. ఆరా తీస్తే.. నకిలీ రికార్డులు సృష్టించి పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కానిచ్చినట్లు తెలిసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించిన సర్వే నెంబరు 513/16 అడంగల్.. ప్రస్తుతం వెబ్లాండ్ రికార్డుల ప్రకారం పరిశీలించగా.. అందులో కానీ, పూర్వపు రికార్డులో కూడా చూపించలేదని, నకిలీ పత్రం తయారు చేశారని, దీనిపై గంటావారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి కుమారుడైన పుల్లారెడ్డిపై చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఈనెల 17వ తేదీన తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. దాంతో పుల్లారెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఎవరీ పుల్లారెడ్డి?

నకిలీ పత్రాలు ఎలా సృష్టించాడు. దీనివెనుక పాత్ర, సూత్రధారులు ఎవరనే విషయమై వెదురుకుప్పం మండలంలో చర్చ జరుగుతోంది. నకిలీ, ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్‌కు సహకరించిన రిజిస్ట్రార్ కార్యాలయం ఉద్యోగులు ఎవరన్న విషయంపైనా చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం చొరవ చూపి నకిలీ పత్రాల తయారీదారుల గుట్టు రట్టు చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

### న్యాయం చేయాలి



మా భూమికి నకిలీ పత్రాలను తయారు చేసిన పుల్లారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అతడికి సహకరించిన వారిపైనా చర్యలు తీసుకోవాలి. మాకు న్యాయం చేయకుంటే ప్రాణత్యాగానికైనా సిద్ధం.

- నీలమ్మ, బాధితురాలు, గంటావారిపల్లె

## ఇంటింటికీ 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్ల పంపిణీ




చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ఇంటింటికీ స్టిక్కర్లను, కరపత్రాలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రానికి 6.02 లక్షల స్టిక్కర్లు, 6.08 లక్షల కరపత్రాలు చేరగా వాటిని 31 మండలాలకు జిల్లా యంత్రాంగం తరలించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది శనివారం నుంచి తమ పరిధిలోని ఇంటింటినీ సందర్శించి వీటిని అందజేస్తారు. ఈనెల 26వ తేదీవరకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో రోజుకో గ్రామంలో ప్రజా వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం బంగారుపాళ్యంలో మంత్రి నారా లోకేశ్.. ప్రజావేదిక కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

## ప్రశాంతంగా వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ

చిత్తూరు, సెప్టెంబరు 20: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగర, పురపాలక సంఘాల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ చిత్తూరులో శుక్రవారం జరిగింది.వివిధ కేటగిరీల్లో బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. కేటగిరీల వారీగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు.వార్డు అడ్మిన్ కార్యదర్శులు 18మంది, ప్రణాళిక కార్యదర్శులు 18మంది, అమినిటీ కార్యదర్శులు 15మంది, వార్డు శానిటేషన్ కార్యదర్శులు 16మంది, ఎడ్యుకేషన్ డేటా కార్యదర్శులు 17మంది, వార్డు వెల్ఫేర్ కార్యదర్శులు 30మంది హాజరయ్యారు. సహాయ కమిషనర్ ప్రసాద్, పలమనేరు, పుత్తూరు, పుంగనూరు, నగరి కమిషనర్లు, మేనేజరు వర్మ, ఏసీపీ రామకృష్ణుడు, ఇంజనీరింగ్‌శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పలమనేరు
## కుప్పం/పుంగనూరు



## ప్రతి హామీని నెరవేరుస్తాం : టీడీపీ

రామకుప్పం, సెప్టెంబరు 20: రాష్ట్ర ప్రజలకు టీడీపీ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్టనారాయణాచారి తెలిపారు. శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై మండల సచివాలయం సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సామావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పించన్ల మొత్తాన్ని పెంచిందన్నారు. మెగా డీఎస్సీపై తొలిసంతకం చేసిందన్నారు. త్వరలోనే మిగిలిన హామీలన్నింటిని అమలు చేస్తుందన్నారు. వందరోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అధికార యంత్రాంగం గ్రామసభల్లో ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఈశ్వరన్న, తహసీల్దారు బాబు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తెలుగు యువత అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తదతరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు



పుంగనూరు రూరల్, సెప్టెంబరు20: పుంగనూరు-రామసముద్రం మార్గంలో గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్డుకు మట్టి వేసి మరమ్మతు పనులను టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి చేపట్టారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా బాబు సూచన మేరకు పత్తెమ్మగారిపల్లె సమీపంలో గుంతల రోడ్డుతో ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మండల నాయకుల సహాయ సహకారంతో మట్టిని టిప్పర్లతో తరలించి గుంతలను పూడ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, గంగాధర్, గంగరాజు, సంజీవ, మాజీ సర్పంచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలలో గెలుపొందిన వి.కోట ఇన్ఫాంట్, కొత్తపల్లి పాఠశాల జట్లు

గంగవరం, సెప్టెంబరు 20 : నియోజకవర్గ అండర్-19 బాలికల కబడ్డీ పోటీలు శుక్రవారం కొత్తపల్లె ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట, పెద్దపంజాణి మండలాలకు చెందిన మొత్తం 32 టీములు హాజరై పోటాపోటీగా తలపడ్డారు. వి.కోటకు చెందిన ఇన్ఫాన్ పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించగా, గంగవరం, కొత్తపల్లె ఉన్నత పాఠశాలల విద్యార్థినులు రన్నరప్‌గా నిలిచి రెండవ స్థానం కైవసం చేసుకున్నారు. గెలుపొందిన జట్లకు షీల్డులు, బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, సర్పంచ్ గిరిరాజారెడ్డి, పీఈటి సురేష్‌బాబు, హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు
## చంద్రమాకులపల్లె విద్యార్థుల ఎంపిక



పుంగనూరు రూరల్, సెప్టెంబరు20: పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 18న మదనపల్లె సమీపంలోని శ్రీవేద పాఠశాల ఆవరణలో అండర్-17 ఫుట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు చంద్రమాకులపల్లె విద్యార్థులు కె.ఆనంద్, రక్షతలు ఎంపికైనట్లు వివరించారు.

## క్రీడలతో విజ్ఞానం, ఆరోగ్యం

రొంపిచెర్ల,సెప్టెంబరు20: క్రీడలతో విద్యార్థులకు విజ్ఞానంతోపాటు ఆరోగ్యం వృద్ధి చెందుతాయని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఎంఈవో ఇందిర ప్రారంభించారు. ఈపోటీలలో 8 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాలు వంటి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని శ్రీనివాసులు తెలిపారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

గుడుపల్లె, సెప్టెంబరు 9: కర్ణాటక నుంచి గుడుపల్లె మీదుగా ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకొని, ఒకరిని అరెస్టు చేసారు. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల మేరకు...శుక్రవారం కర్ణాటక సరిహద్దులోని పొగురుపల్లె రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. కనమనపల్లె గ్రామానికి చెందిన కుమార్ కర్ణాటకలోని మద్యం షాపుల నుంచి చీప్ లిక్కర్ కొనుగోలు చేసి సంచిలో ఉంచుకొని ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఆపామన్నారు. అతడు ద్విచక్ర వాహనాన్ని వదిలి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకున్నట్లు చెప్పారు. సంచిని పరిశీలించగా అందులో 96 ప్యాకెట్లు చీప్ లిక్కర్ మద్యం బయటపడింది. మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## నేడు కుంభార్లపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం'

వి.కోట, సెప్టెంబరు 20: వి.కోట మండలం కుంభార్లపల్లె పంచాయతీ పరిధిలో కూటమి ప్రభుత్వం పాలన వంద రోజులు పూర్తైన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ తెలిపారు. 21న శనివారం ఉదయం 9 గంటలకు బాలేంద్రపల్లె, ముమ్మిడేర్లపల్లె, కుంభార్లపల్లె, గెస్తింపల్లె, అనంతపురం గ్రామాల్లో జరిగే కార్యక్రమానికి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## టీడీపీ నేతకు సన్మానం



పుంగనూరు, సెప్టెంబరు20: రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజును పుంగనూరు టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యంరాజు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శుక్రవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిసి పుంగనూరులో పార్టీ పని తీరుపై వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మణరాజు, జ్యోతిరాజు, వరదరాజు, విజయభాస్కర్‌రాజు పాల్గొన్నారు.



## నెలాఖరులోగా
## హౌసింగ్ బిల్లుల చెల్లింపు

కుప్పం రూరల్, సెప్టెంబరు 20: పెండింగులో ఉన్న పక్కా ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తి చేస్తే నెలాఖరులోగా బిల్లులు వచ్చేలా చూస్తామని ఎంపీడీవో సాయి లహరి తెలిపారు. మండలంలోని మల్లానూరులో శుక్రవారం జరిగిన హౌసింగ్ లబ్ధిదారుల సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు.టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, నాయకులు దామోదర్, రమేశ్, పార్థసారథి, రమేశ్, ఆర్ముగం, చంద్ర, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక
## పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పలమనేరు, సెప్టెంబరు20 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిధి అధ్యాపక పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు కోరారు. అనిమల్ హస్బెండరీ, రసాయన శాస్త్రాల్లో అతిధి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత కోర్సుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలన్నారు. పీహెచ్‌డీ లేదా యూజీసీ నెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, దరఖాస్తులను ఈనెల 25లోపు కళాశాలలో అందజేయాలని కోరారు.

## వరద బాధితుల కోసం విరాళం



పలమనేరు, సెప్టెంబరు 20 : విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక గోవింద దివ్యధామం ట్రస్టు సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధికి పంపడానికి రూ. 40,056 చెక్కును ఆర్డీవో మనోజ్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కృష్ణమూర్తిరెడ్డి, సిద్దయ్య, రంగనాయకులు, మురుగేష్, బాల, గందన్న పాల్గొన్నారు.

## తూకాల్లో తేడాలకు పాల్పడితే చర్యలు

కల్లూరు, సెప్టెంబర్ 20: చౌకదుకాణాల్లో పంపిణీ చేసే సరుకుల తూకాల్లో తేడాలు కనిపిస్తే చర్యలు తప్పవని పలమనేరు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమాదేవి తెలిపారు. పులిచెర్ల మండలంలోని చౌకదుకాణాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. మండలంలో 32 చౌకదుకాణాలు ఉండగా 28 చౌక దుకాణాల్లోని వేయింగ్ మెషీన్లను, వాటి పనితీరును పరిశీలించి ఆ మెషీన్లకు సీల్ వేసి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

## పసుపు, కుంకుమ అలంకరణలో
## విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, సెప్టెంబరు20: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఉపవాసదీక్షలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## ఐటీఐలో ప్రవేశానికి
## దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం, సెప్టెంబర్ 20 : శాంతిపురం ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పది వతరగతి పాస్ అయిన విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఐటీఐ.ఎన్ఐసి. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 27న తుమ్మిశి ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కుప్పం, సెప్టెంబరు 20: కుప్పం పురపాలక సంఘం గుల్లేపల్లె సమీపంలోని రైలు పట్టాలపై శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం రైల్వే పోలీసులకు లభ్యమైంది. మృతుడి వయసు సుమారు 55-60 సంవత్సరాలు ఉంటుందని రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడన్నారు. గుర్తుపట్టలేని విధంగా దేహం ఛిద్రమైందని, ఎవరైనా తప్పిపోయి ఉంటే, సంబంధిత వ్యక్తుల కుటుంబ సభ్యులు తమను సంప్రదించాలని ఆయన కోరారు.

## నేడు మోటుమల్లెలలో గ్రామసభ

రొంపిచెర్ల, సెప్టెంబరు 20 : మండలంలోని మోటుమల్లెల పంచాయతీ పెండ్లిగంగమ్మ గుడి వద్ద గల రైతు భరోసా కేంద్రంలో శనివారం ఉదయం గ్రామసభ ఉంటుందని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలిపారు. ఈ సమావేశానికి పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హాజరవుతారని, అధికారులు, ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## వంగసానివారిపల్లె సమీపంలో ఏనుగులు

సోమల, సెప్టెంబరు 20: సోమల మండలంలో రోజుకో చోట ఏనుగులు సంచరించి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. గురువారం రాత్రి సోమల పంచాయతీ నుంచి సరస్వతీపురం మీదుగా వచ్చి వంగసానిపల్లె వద్ద సంచరించాయి. ఇర్లపల్లె వద్ద ఏనుగులను గుర్తించిన గ్రామస్తులు గ్రామంలోకి ఏనుగులు రాకుండా ఇళ్ల వద్ద మంటలు వేసుకుని డప్పులు వాయిస్తూ నిద్రలేని రాత్రులు గడిపినట్లు గ్రామస్తులు తెలిపారు.

## లడ్డూలో జంతుకొవ్వా?
### బాధ్యులపై చర్యలకు రామచంద్రయాదవ్ డిమాండ్

పుంగనూరు, సెప్టెంబరు 20: తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాల్లో కల్తీ నెయ్యి వినియోగించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీవైపీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పుంగనూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధ్యులను 48 గంటల్లో గుర్తించి కఠినంగా శిక్షించకపోతే వెంకన్న భక్తుడిగా దీన్ని వదిలే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో సీఎం జగన్, ఈవో ధర్మారెడ్డి, ఛైర్మన్ సుబ్బారెడ్డి, పాలకమండలి కుట్రతో చరిత్రలో సరిదిద్దలేని అపచారానికి పాల్పడ్డారన్నారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై సీబీఐ విచారణ చేపట్టాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కు లేఖ రాస్తున్నానని, బాధ్యులను అరెస్టు చేయాలని టీటీడీ ఈవోకు లేఖ రాస్తున్నట్లు వివరించారు. నాయకులు సి.సాంబమూర్తి, ఆర్.హరినాథరెడ్డి, రమేశ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమాలకు చిరునామా చంద్రబాబు
### ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



వంద రోజుల ప్రగతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 20: అభివృద్ధి, సంక్షేమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చిరునామా అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం 9వ వార్డుకు సంబంధించి 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో వార్డు సభలను ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ప్రతినెలా ఒకటో తారీఖునే ఉద్యోగులకు వేతనాలు వంటి ఎన్నో పథకాలు, నిర్ణయాలను ఈ వంద రోజుల వ్యవధిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేశారన్నారు. వైసీపీ దుర్మార్గ పాలనలో ఖజానా ఖాళీ అయి రాష్ట్ర ప్రభుత్వం అప్పులపాలైనా, విజయవాడ వరదల్లో కనీవినీ ఎరుగని కష్టనష్టాలు ఎదురైనా వెరవకుండా ఇచ్చిన హామీల అమలుకు ఆయన చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని చెప్పారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ దాడులు, దౌర్జన్యాలు, ఎదిరించిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లపాలు చేయడాలు తప్ప వైసీపీ హయాంలో మరో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన మొదలు పెట్టారన్నారు. వంద రోజుల్లోనే ప్రజల అంచనాలను అందుకున్నారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, కూటమి నేతలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఇది మంచి ప్రభుత్వం'
## వార్డు సభల ప్రారంభం

కుప్పం, సెప్టెంబరు 20: 'ఇది మంచి ప్రభుత్వం' వార్డు సభ కుప్పం పురపాలక సంఘంలోని 9వ వార్డుకు సంబంధించి ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 21న సంపంగి నగర్, 22న సీగలపల్లె, బైరుగానిపల్లె, కమతమూరు సచివాలయం, 23న దొమ్మర వీధి, 24న అనిమిగానిపల్లె, 18, 20 వార్డుల్లో, 25న పలార్లపల్లె, టీబీ రోడ్డు, 26వ తేదీన విజయలక్ష్మి రోడ్లలో 'ఇది మంచి ప్రభుత్వం' వార్డు సభలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి గ్రామ సభలోనూ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొంటారని తెలిపారు.

**శాంతిపురం** : మండలంలో శనివారం నుంచి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుమార్ తెలిపారు. 21న సొన్నేగానిపల్లె, కొలమడుగు, దండికుప్పం, అబకలదొడ్డి, తుమ్మిశి, శివరామపురం, 23న కడపల్లె, కర్లగట్ట, మొరసనపల్లె, 121పెద్దూరు, 24న కోనేరుకుప్పం, అనికెర, రేగడదిన్నేపల్లె మఠం, ఎంకేపురం, 25న సి బండపల్లె, చిన్నారిదొడ్డి,గుంజార్లపల్లె, నడింపల్లె, 26న 64పెద్దూరు, రాళ్ళబూదుగూరు, చెంగుబల్ల, కెనమాకులపల్లె గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

**రామకుప్పం** : రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా శనివారం నుంచి 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరన్న తెలిపారు. 21న పంద్యాలమడుగు, ఆనిగానూరు, బైపరెడ్లపల్లె, రాజుపేట, 23న నారాయణపురంతాండా, బందార్లపల్లె, చెల్దిగానిపల్లె, గొరివిమాకులపల్లె, కెంచనబల్ల, కొంగనపల్లె, 24న మణీంద్రం, ముద్దనపల్లె, ననియాలతాండా, బల్ల, పీఎంకేతాండా, 25న రామకుప్పం, సింగసముద్రం, చిక్కపల్లెతాండా, 26న గుట్టూరుతాండా, పెద్దతాండా, వీర్నమల, విజలాపురంలలో గ్రామసభలు జరుగుతాయని ఆయన తెలిపారు.

# విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతుల ధర్నా



గుడుపల్లె సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

గుడుపల్లె, సెప్టెంబరు 20: నిత్యం విద్యుత్ కోతలు విధిస్తుండడంతో బోర్ల నీటిపై ఆధారపడి పండిస్తున్న పంటలు ఎండిపోతున్నాయని నిరసిస్తూ రైతులు శుక్రవారం గుడుపల్లె సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...రైతుల కోసం రోజూ ప్రభుత్వం ఏడు గంటల విద్యుత్ సరఫరా అందిస్తుండగా గుడుపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో నిత్యం కోతలు విధిస్తున్నారని తెలిపారు. అధికారులకు తెలిపినా విద్యుత్ కోతలు తగ్గడం లేదన్నారు. దీంతో విద్యుత్ సరఫరా లేక నీరు అందక పంటలు ఎండుముఖం పట్టాయన్నారు. అప్పులు చేసి పంటలు పండిస్తే విద్యుత్ కోతలతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మండలంలోని ఇతర సబ్‌స్టేషన్లలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతుండగా గుడుపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో మాత్రం కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ వచ్చి రైతులతో మాట్లాడి ఇక నుంచి విద్యుత్ కోతలు లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

# కలెక్టర్ ఆదేశాలతో దారి సౌకర్యం



పెద్దఉప్పరపల్లె గ్రామస్తులతో తహసీల్దార్ బెన్నిరాజ్, ఎక్స్‌వేటర్‌తో దారి సౌకర్యం కల్పిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోమల, సెప్టెంబరు 20: సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాలతో గృహనిర్మాణాలు చేపట్టిన కాలనీ వాసులకు శుక్రవారం తహసీల్దార్ బెన్నిరాజ్ దారి సౌకర్యం కల్పించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో దారి కోసం పెద్దఉప్పరపల్లెవాసుల నిరసన వార్తకు అధికారులు స్పందించారు. కాలనీవాసులకు దారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు పెద్దఉప్పరపల్లెకు చేరుకుని కాలనీకి అడ్డుగా వేసిన రాళ్లను, గోతులను ఎక్స్‌వేటర్‌తో పూడ్చి వేశారు. ఈ క్రమంలోనే భూ యజమాని చంద్రయ్య తన భూమికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని వాపోయారు., పోలీసులు, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత అందరి బాధ్యత

సదుం, సెప్టెంబరు 20: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని సదుం పంచాయతీ సర్పంచ్ ఉషారాణి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక వినాయక పాలిటెక్నిక్ అగ్రి కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్ల నిరంతర వాడకం, చేతుల శుభ్రత, నివాస ప్రాంతాల్లో పచ్చదనం, పరిశుభ్రత పాటించడంపై ప్రజలు చైతన్యం కావాలని ఆమె సూచించారు. అనంతరం బస్టాండు కూడలిలో విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హసీనా, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**పలమనేరు** : మున్సిపల్ అధికారులు, సచివాలయసిబ్బంది శుక్రవారం స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో భాగంగా బాపూజీ ఉద్యానవనంలోను, సచివాలయ ప్రాంతంలోను మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. చెత్త డంపింగ్ ప్రాంతాలను గుర్తించి వాటిని శుభ్రపరచి తదుపరి అక్కడ ఉన్న వ్యర్థాలను కంపోస్టు యార్డుకు తరలించారు. పారిశుధ్యకార్మికులకు వర్తించు ప్రభుత్వ పథకాలపై ఎంఈపీఎంఏ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ రమణారెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ రూపేష్, మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

వి.కోట, సెప్టెంబరు 20: వి.కోట పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మి, ఈవో శివశంకర్ తెలిపారు. పట్టణంలోని ఏపీజే కలాం వీధిలో డెంగ్యూ జ్వరంతో బాలిక మృతి చెందడంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ జ్వరాల అదుపునకు చర్యలు చేపట్టారు. ఓగు పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్ నేతృత్వంలో ఏఎన్‌ఎంలు ఇంటింటా జ్వర బాధితులతో మాట్లాడుతున్నారు. ప్రస్తుతానికి జ్వరాలు అదుపులోనే ఉన్నాయని, ఇళ్ళ మధ్య చెత్తాచెదారం ఉండడంతో వాటిని తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గంగమ్మ ఏరులో మురుగు నీటి ప్రవాహం జరిగేలా పూడిక తీతపనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అలాగే నీరు నిల్వ ఉండేచోట లార్వాలు లేకుండా ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు.

## గుండెపోటుతో జనసేన నాయకుడి మృతి



పుంగనూరు రూరల్, సెప్టెంబరు20: గుండెపోటుతో జనసేన నాయకుడు వేణు శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పుంగనూరు మండలం మేలుందొడ్డి గ్రామానికి చెందిన చౌడప్ప కుమారుడు వేణు(28) శుక్రవారం పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి రొమ్మునొప్పిగా ఉన్నట్లు కుటుంబసభ్యులకు తెలిపారు. ఆసుపత్రికి తరలించడానికి ప్రయత్నించే లోపే మృతి చెందినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపుకోసం జనసేన నాయకుడుగా పని చేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు20: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ హోమియోపతి వైద్యులు నాగేనాయక్ కోరారు. శుక్రవారం స్థానిక ప్యాలెస్‌లోని మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హోమియోపతి మందులు పంపిణీ చేశారుఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేడినీటిని తాగాలని, నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను తినరాదని సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సురేశ్, సీవీరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయ ముందు భాగాన్ని ఢీకొన్న టెంపో



వి.కోట, సెప్టెంబరు 20: వి.కోటలోని వీరాంజనేయ స్వామి ఆలయం ముందు భాగాన్ని ఓ టెంపో ఢీకొంది. శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఆలయ సమీపంలో మిట్ట ప్రాంతంలో ఓ టెంపోను ఆపి డ్రైవర్ దిగివెళ్ళాడు. కాసేపటికి ఆ టెంపో రోడ్డు మీదకు దూసుకువచ్చి ఆలయం ముందు భాగాన్ని ఢీకొని ఆగింది. అదే సమయానికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అప్రమత్తమై పక్కకు వెళ్ళడంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు చేరుకుని టెంపోను తొలగించి స్టేషన్ వద్దకు తీసుకువెళ్ళి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఆలయం ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది.

## వినాయకుడి సేవలో ఎమ్మెల్యే



పలమనేరు, సెప్టెంబరు20 : పలమనేరులో వినాయక చవితి సందర్భంగా అంకిశెట్టి వీధిలో ఏర్పాటు చేసిన చవితి వినాయకుడిని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతవాసులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సన్మానించారు.

## లోకేశ్‌ను కలిసిన చల్లా బాబు



పుంగనూరు, సెప్టెంబరు 20: మంత్రి నారా లోకేశ్‌ను పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం బంగారుపాళ్యంలో డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవం, ప్రజావేదిక కార్యక్రమాల్లో చల్లా బాబు పాల్గొని లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు.

## వైసీపీ కౌన్సిలర్‌పై కేసు నమోదు

పలమనేరు, సెప్టెంబరు20 : పలమనేరులోని 17వ వార్డు వైసీపీ కౌన్సిలర్ హైదర్‌పై షాహీనా అనే మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. 2020లో అనారోగ్యంగా ఉన్న భర్త చికిత్స కోసం హైదర్ వద్ద హసీనా అప్పు తీసుకొందని, అటు పిమ్మట హసీనా భర్త ఆరోగ్యం కుదుట పడక చనిపోయారని, అయితే హైదర్ వద్ద తీసుకొన్న మొత్తం చెల్లించినా తాను తాకట్టుపెట్టిన బంగారు నగలు ఇవ్వకుండా హైదర్ కాలయాపన చేస్తూ వచ్చాడన్నారు. అయితే గురువారం రాత్రి ఈ విషయమై హసీనా హైదర్‌ను నిలదీయగా హసీనాతో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు దౌర్జన్యం చేశాడని హసీనా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## గ్రానైట్ లారీ స్వాధీనం

గుడుపల్లె, సెప్టెంబరు 20: అక్రమంగా గ్రానైట్ దిమ్మెలను శాంతిపురం మండలం నుంచి గుడుపల్లె మీదుగా తమిళనాడుకు తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ శాంతిపురం మండలం సోమాపురం నుంచి గురువారం రాత్రి గుడుపల్లె మండలం పొగురుపల్లె రహదారిలో గ్రానైట్ లోడ్‌తో తమిళనాడుకు వెళుతున్న లారీ తమ కంటపడిందన్నారు. లారీని ఆపి పరిశీలించగా అందులో గ్రానైట్ ఉందన్నారు. గ్రానైట్ తరలింపునకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో లారీని స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషకు తరలించి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. లారీని పలమనేరు మైన్స్ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రభంజనం




బంగారుపాళ్యంలో మంత్రి నారా లోకేశ్ రోడ్ షో - ప్రజా వేదికపై అర్జీలను తీసుకుంటున్న మంత్రిని చుట్టుముట్టిన జనం

## మంత్రి నారా లోకేశ్‌కి ఘన స్వాగతం

బంగారుపాళ్యం, సెప్టెంబరు 20: బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రిలో డయాలిసిస్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం లభించింది. మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, టీడీపీ నాయకులు క్రేన్‌తో గజమాలను ఏర్పాటు చేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీ జయచంద్ర నాయుడు, ఎన్‌పీ ధరణీప్రసాద్ నాయుడు, ఎన్‌పీ విక్రమ్, ఎన్‌పీ నవీన్, కోకా ప్రకాష్ నాయుడు, కుప్పాల మురళి, కళావతి మహేంద్ర, కోదండ యాదవ్, హేమచంద్రనాయుడు, జనసేన నాయకులు కోడిచంద్రయ్య, పవన్, బాలు తదితరులు ఉన్నారు. అంతకు ముందు రూ.5 కోట్లతో నిర్మించిన 30 పడకల ప్రభుత్వాస్పత్రిని మంత్రి ప్రారంభించగా, ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమరమ్మ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కమల్‌నాథ రెడ్డి, ప్రవీణ్, కోదండ యాదవ్, జనార్దన్ గౌడ్, లోకనాథం నాయుడు, రమేష్, హరిప్రసాద్, రాధాకృష్ణమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.





బంగారుపాళ్యంలో 30 పడకల ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించిన మంత్రితో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ - దయాలసిస్ సెంటర్‌కు ప్రారంభోత్సవం





నియోజకవర్గ నేతలతో మాట్లాడుతున్న మంత్రి - ఇది మంచి ప్రభుత్వం బ్రోచర్ ఆవిష్కరణ - కోటూరులో వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న నారా లోకేశ్

## పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 20: పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అని వరసిద్ధుడి ఆలయ ఈవో గురుప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆలయ పరిసరాల్లో స్వచ్ఛతాహి సేవ కార్యాక్రమాన్ని అధికారులు, సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలగిరి, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలు భాగస్వాములు కావాలి**

చిత్తూరు: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని నగరపాలక ఆరోగ్య అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని జైహింద్ పాఠశాలలో విద్యార్థులు, మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి ర్యాలీ, స్వచ్ఛత ప్రతిజ్ఞను నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, నరసింహ, హెచ్‌ఎంలు బాలసుబ్రహ్మణ్యం, ముక్తార్ అహ్మద్, కల్పన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు, సెప్టెంబరు 20: నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం కమిషనర్ నరసింహప్రసాద్ పరిశీలించారు. సంతపేట పీసీఆర్ హైస్కూల్ మైదానంలో తనిఖీ చేసి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. వన్నియర్ బ్లాక్, బజారువీధి, హైరోడ్డు ప్రాంతాల్లోనూ పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం పాల్గొన్నారు.

## సేఫ్టీవాల్ నిర్మించండి



కోసలనగరంలో పూడిపోయిన వరవ కాలువ

విజయపురం, సెప్టెంబరు 20: కోసలనగరం పోతురాజుల సైక నుంచి గంగమ్మమాను వరకు పాతార్కాడు చెరువుకు వెళ్లే వరవ కాలువ పూడిపోయిందని గ్రామస్తులు తెలిపారు. దీనివల్ల తేలికపాటి వర్షానికి కూడా నీరు రోడ్డుపై పారుతోందని చెప్పారు. ఇది మురుగుగా మారి దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వరవ కాలువ నీరు రోడ్డుపై ప్రవహించకుండా సేఫ్టీ వాల్ నిర్మించాలని కోరుతున్నారు.

## విజయపురం ఎస్‌ఐగా బలరామయ్య

విజయపురం, సెప్టెంబరు 20: విజయపురం ఎస్‌ఐగా బలరామయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కదిరిలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎస్‌ఐని సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు.

## పారిశుధ్య పనులు ప్రారంభం

పాలసముద్రం, సెప్టెంబరు 20: వనదుర్గాపురంలో శుక్రవారం సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమాన్ని ఎంపీడీవో రామనాథరెడ్డి ప్రారంభించారు. వనదుర్గాపురం, ఎగువ వనదుర్గాపురం, దిగువ వనదుర్గాపురం, ఎస్టీ కాలనీలో కాలువలను శుభ్రం చేయించి, పిచ్చిమొక్కలను తొలగించి.. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈవోపీ ఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, సెప్టెంబరు 20: కార్వేటినగరం ఆర్కేఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్రం బోధించడానికి గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ పి.స్వరూప తెలిపారు. ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

## అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 20: కార్వేటినగరంలోని అంకాల పరమేశ్వరికి, ద్రౌపది అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

## నిరుపయోగంగా మంచినీటి ట్యాంకు



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 20: చిన్నతయ్యూరు పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఏడాది కిందట 25.06 లక్షల 40వేల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న మంచినీటి ట్యాంకు నిర్మించారు. రూ.10లక్షలతో ట్యాంకు నిర్మాణం, పైపులైన్లు, ఇంటింటికీ మంచి నీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. రెండు నెలల కిందట అధికారులు ఈ ట్యాంకు నుంచి పైపులైన్లకు నీటిని విడుదల చేసి కూడా పరీక్షించారు. ఇంతా చేసి ఈ ట్యాంకును నిరుపయోగంగా పెట్టేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రిని కలసిన ఎమ్మెల్యే, ఈవో



ఐరాల (కాణిపాకం), సెప్టెంబరు 20:బంగారుపాళ్యంలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి నారా లోకేశ్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం ఆలయ ఈవో గురుప్రసాద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు స్వామి శేషవస్త్రాన్ని కప్పి ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. అలాగే వరసిద్ధుడి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాలకు విచ్చేయాలని కోరారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కోదండరామాలయంలో 2నుంచి పవిత్రోత్సవాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 20: నగరంలోని కోదండరామాలయంలో అక్టోబరు రెండు నుంచి ఐదో తేదీవరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

## సారా విక్రేత అరెస్టు

పాసముద్రం, సెప్టెంబరు 20: నర్సింహాపురంలో సారా విక్రయిస్తున్న శ్రీనివాసన్(45)ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ భారతి తెలిపారు. శుక్రవారం సాయంత్రం సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో ఆమె తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న సారాను స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## పౌష్టికాహారంపై అవగాహన

నింద్ర, సెప్టెంబరు 20: ఎలకాటూరు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్యామల మాట్లాడుతూ.. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు ప్రమీల, ద్రాక్షయణి, కవిత, భారతి, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టేబుల్ టెన్నిస్‌లో బృందావన్ విద్యార్థుల సత్తా



చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 20: కాకినాడ పెద్దాపురం శ్రీప్రకాష్ సీనర్జీ పాఠశాలలో ఇటీవల జరిగిన విజయవాడ రీజియన్ క్లస్టర్ ఫోర్ టేబుల్ టెన్నిస్‌లో స్థానిక బృందావన్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కరస్పాండెంట్ శైలజా కుమారి తెలిపారు. అండర్ 14,17,19లో పాఠశాలకు చెందిన హర్షిత్, విష్ణు, రెడ్డిప్రసాద్, రిషి, బాలికల జట్టులో నీతు, దేవ పాల్గొన్నారు. 30 సీబీఎస్‌ఈ పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో రంగారెడ్డి జిల్లా శాంతినికేతన్ విద్యార్థులతో తలపడి విజయం సాధించారన్నారు. వీరిని కోచ్ మురళి, పీడీ బేబీ, పీఈటీ హేమతలలు అభినందించారు.

## తూగుండ్రంలో వినాయక చవితి వేడుకలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 20: తూగుండ్రం గ్రామంలో వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. అర్చకుడు శివకుమార్ వేదమంత్రాలు, పంబల వాయిద్యాల నడుమ పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

## ప్రజారంజక పాలన అందిస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే గురజాల



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 20: ప్రజా రంజక పాలన అందిస్తున్నందుకే 'ఇది మంచి ప్రభుత్వమని' ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శుక్రవారం 46వ డివిజన్ సంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని చెప్పారు. విజయవాడలో వరదలు సృష్టించిన బీభత్సంతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉంటే సీఎం పది రోజులు అక్కడే ఉండి ప్రజలను అన్ని విధాలా ఆదుకున్నారని గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గతనెల 23న రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, మాజీ మేయర్ కటారి హేమలత, నగర కమిషనర్ నరసింహ ప్రసాద్, నేతలు వసంత్ కుమార్, ఈశ్వర్, సీఎం విజయ, మురళి, వెంకటేష్ యాదవ్, కంద, సురేష్, ఉదయ్, రాణి, శ్రీదుర్గ, ప్రతిభ, బీజేపీ నేతలు అట్లూరి శ్రీనివాసులు, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

## బసవాపల్లె వనమిత్ర కేంద్రాన్ని పట్టించుకోరా?



రోడ్డు పక్కన ముళ్లకంపల మధ్య ఉన్న బసవాపల్లె వనమిత్ర కేంద్రం

గుడిపాల, సెప్టెంబరు 20: మండలంలోని బెంగళూరు - చెన్నై, చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని భద్రకాళమ్మ గుడి, ఎంసీఆర్ క్రాస్ వద్ద ఉన్న బసవాపల్లె వనమిత్ర కేంద్రాన్ని పర్యాటక కేంద్రంగా చేయాలని 20 ఏళ్లుగా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు తీవ్ర ప్రయత్నాలు చేసినా ఆచరణకు నోచుకోలేదు. దీనిపై గతంలోనే అవసరమైన నివేదికలు ప్రభుత్వానికి పంపి ఉన్నారు. పుణ్యక్షేత్రాలైన తిరుమల, తిరుచానూరు, కాణిపాకం, వేలూరులోని గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలై తదితరాలకు నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయి. చిత్తూరుకు 15 కిలోమీటర్ల దూరంలో రోడ్డుకు పక్కనే ఉన్న బసవాపల్లె వనమిత్ర కేంద్రాన్ని పర్యాటక కేంద్రంగా రూపొందించి.. భక్తులు సేదతీర్చుకొనేందుకు ఏర్పాట్లు చేస్తే ఇటు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. యాత్రికులకు కూడా సౌకర్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు ఎమ్మెల్యేగా ఉన్న గురజాల జగన్మోహన్ అయినా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సోలార్ బాయిలర్స్ వినియోగం లాభదాయకం



సదస్సులో పాల్గొన్న పండ్ల పరిశ్రమల యాజమాన్యాలు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 20: సోలార్ బాయిలర్స్ వినియోగం లాభదాయకమని కిర్లోస్కర్ కంపెనీ ప్రతినిధులు మీనాక్షి సుందరం, సత్యమూర్తి తెలిపారు. కిర్లోస్కర్ సంస్థ ఉత్పత్తులు, సోలార్ బాయిలర్స్‌పై శుక్రవారం మ్యాంగో భవన్‌లో పండ్ల శుద్ధి పరిశ్రమ యాజమాన్యాలకు అవగాహన కల్పించారు. జిల్లా పండ్ల పరిశ్రమ సమాఖ్య కార్యదర్శి బాబి, బాబురెడ్డి, అమర్నాథ్, తరుణ్, కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బాధితుల సహాయార్థం వేము రూ.10 లక్షల విరాళం



మంత్రి లోకేశ్‌కు చెక్ అందజేస్తున్న చంద్రశేఖర నాయుడు, చరణ్

పూతలపట్టు/బంగారుపాళ్యం, సెప్టెంబరు 20: విజయవాడలో వరదల కారణంగా వీధిన పడ్డ బాధితుల సహాయార్థం పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపంలోని వేము ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు రూ.10లక్షల విరాళమందజేశారు. శుక్రవారం బంగారుపాళ్యానికి వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ను కలసి విరాళానికి సంబంధించిన చెక్‌ను అందజేశారు.ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్మోహన్, మాజీ కార్పొరేటర్ వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● బంగారుపాళ్యం మండలంలోని శేషాపురానికి చెందిన గుడివాడ చరణ్ రూ.1.80లక్షల చెక్‌ను శుక్రవారం మంత్రికి అందజేశారు. అలాగే విజ్ఞాన్ కాలేజ్ విద్యార్థులు, పలువురు దాతలు కూడా విరాళాలు మంత్రికి అందించారు.

## నాణ్యమైన విద్యకు అధిక ప్రాధాన్యం: ఆర్జేడీ



ఎంఈవోల సంఘం నాయకులతో మాట్లాడుతున్న శ్యామ్యూల్

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 20: నాణ్యమైన విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కడప ఆర్జేడీ శ్యామ్యూల్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం డీఈవో కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితోపాటు ఎంఈవోల సంఘం నాయకులతో పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో ప్రాంతాల అభిరుచులకు తగిన విధంగా మార్పులు చేయనున్నట్లు స్పష్టం చేశారు. టీచర్లు పాఠశాలకు ఆలస్యంగా రావడాన్ని, ముందుగా వెళ్లడాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇలాంటివారికి షోకాజ్ నోటీసులు ఇస్తామని చెప్పారు. అలాగే ఎలాంటి అనుమతి లేకుండా పాఠశాలకు హాజరుకాకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మంత్రిని కలిసిన టీడీపీ నేతలు



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 20: మంత్రి నారా లోకేశ్‌ను తిరుపతి విమానాశ్రయంలో గంగాధరనెల్లూరు మండలానికి చెందిన నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లేపల్లె పంచాయతీకి చెందిన జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డిపల్లె ఆదిఆంధ్రవాడకు చెందిన రిటైర్డ్ ఎస్పీ, టీడీపీ నేత చిన్నస్వామి ఉన్నారు.

## టెంపో ట్రావెలర్‌ను ఢీకొన్న లగేజీ వాహనం

### నలుగురికి స్వల్ప గాయాలు



రోడ్డుపక్కన గోతిలోకి ఒరిగిన టెంపో ట్రావెలర్ - ముందుభాగం ధ్వంసమైన లగేజీ వాహనం

బంగారుపాళ్యం, సెప్టెంబరు 20: టెంపో ట్రావెలర్‌ను లగేజీ వాహనం ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. తిరుమల శ్రీవారి దర్శనార్థం ఉడిపికి చెందిన కుమార్, మోహన్, సతీష్, విజయ్ కుమార్‌లు టెంపో ట్రావెలర్‌లో బయల్దేరారు. శుక్రవారం ఉదయం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్ వద్దకు వచ్చేసరికి పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న లగేజీ వాహనం వెనుక వైపునుంచి ఢీకొంది. దీంతో పక్కనే ఉన్న గోతిలోకి టెంపోట్రావెలర్ ఒరిగింది. అందులోని నలుగురికీ స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. లగేజీ వాహనం ముందు భాగం ధ్వంసమైంది.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20: రెడ్డిగుంట పరిధిలోని 33/11 కేవీ తుమ్మింద, అనుప్పల్లె సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

## పాఠశాల ఆవరణలో మందుబాబుల ఆగడాలు



పాఠశాల ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు - ధ్వంసమైన తాగునీటి కొళాయిలు

పాలసముద్రం, సెప్టెంబరు 20: మండల కేంద్రంలోని కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం రాత్రి మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలను పడేశారు. అలాగే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు ధ్వంసం చేశారని శుక్రవారం ఎస్‌ఐ భారతికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పాఠశాల గ్రామానికి చివరన ఉండటం, ప్రహరీ లేకపోవడంతో రాత్రిపూట మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో ఎస్‌ఐ వచ్చి పాఠశాలను పరిశీలించి, మందుబాబులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు కావలెను !

నగరి, సెప్టెంబరు 20: నగరిలో రెండు ఎస్‌ఐ పోస్టులుంటే ఒక్కరూ లేరు. నగరి మండల పరిధిలోని ఓజీకుప్పం నుంచి గంజాయి అమ్మకందారులు పలు చోట్ల పట్టుబడుతున్నారు. సెల్‌ఫోన్‌లు, మోటార్ బైక్‌ల చోరీలూ జరుగుతున్నాయి. ఇక తమిళనాడు సరిహద్దున గల విజయపురం మండలంలో తరచూ ఏదో ఒక సమస్య వస్తూనే ఉంటుంది. ఇక్కడ 17 మంది కానిస్టేబుళ్లకుగాను కేవలం ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. నింద్రలోనూ ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు లేకపోవడంతో సమస్యలు సకాలంలో పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**డీఎస్పీ పోస్టు కూడా ఖాళీనే..:** నగరి డీఎస్పీ పోస్టు సైతం ఖాళీగా ఉండటం గమనార్హం. ఇకనైనా ఈ పోస్టులను భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇసుకను దోచేస్తున్నారు: నారాయణస్వామి

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 20: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రూ.కోట్లలో ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా ఎమ్మెల్యే థామస్ పట్టించుకోకపోవడం దారుణమని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. ఎస్‌ఆర్‌పురం మండలం మంగుంట గ్రామంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉచితంగా ఇసుక సరఫరాహామీ తుంగలో తొక్కేశారని అన్నారు.


## మండల స్థాయిలో స్కూల్ గేమ్స్



చెస్ ఆడుతున్న విద్యార్థులు

నగరి, సెప్టెంబరు 20: నాగరాజకుప్పం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 68వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం అండర్ 14, 17 బాల, బాలికలకు చెస్, యోగా, అథ్లెటిక్స్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయలు తెలిపారు. నగరి కోఆర్డినేటర్ కేశవులు, ఆర్గనైజర్ చెన్నకేశవులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

## సింగిల్ విండో మాజీ అధ్యక్షుడి మృతి



జయచంద్ర నాయుడు (ఫైల్ ఫొటో)

గుడిపాల, సెప్టెంబరు 20: శ్రీరంగంపల్లె మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు జయచంద్ర నాయుడు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన సింగిల్ విండో అధ్యక్షుడిగా, బసవాపల్లె సర్పంచ్‌గా, ఎంపీటీసీగా వ్యవహరించారు. ఈయన మృతిపట్ల పలువురు టీడీపీ, వైసీపీ నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దహనక్రియలు శనివారం స్వగ్రామమైన కట్టకిందపల్లెలో నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

## బొమ్మలతో బోధన ఎంతో ఉపయోగం

నింద్ర, సెప్టెంబర్ 20: ఎలకాటూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బొమ్మలతో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు భాస్కర్‌రావును శుక్రవారం ఎంఈవో శ్రీధర్‌రాజు అభినందించారు. ఎంఈవో వసుమతి, సీఆర్‌పీలు మునెమ్మ, తులసి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 20: గంగాధరనెల్లూరు హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు 100 గొల్లపల్లె వద్ద ఉన్న జైన్ ఫామ్ ఫ్రెష్ ఫ్యాక్టరీ మేనేజర్ షమీర్‌శర్మ సహకారంతో రూ.25వేల విలువచేసే స్టడీ మెటీరియల్‌ని ఆ ఫ్యాక్టరీ ఇంజనీర్ మోహిత్ పటేల్, సీనియర్ ఉద్యోగులు రాజారామ్ పంపిణీ చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం దినకర్, తదితరులు పాల్గొన్నారు.